# కల నెరవేరేనా?

**క్రీడా మైదానం లేక ఆటగాళ్ల అవస్థలు**

**దూర ప్రాంతాలకు వెళ్లి ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు**



**మల్కాపురం: విశాఖ నగరంలోనే పేరు గాంచిన పారిశ్రామిక వాడలో కనీస వసతులతో కూడిన క్రీడా మైదానం లేకపోవటం ఆశ్చర్య**కరం. పలు రంగాల్లో రాణిస్తున్న పలువురు క్రీడాకారులు ఈ ప్రాంతంలో ఉన్నప్పటికీ వారు నిత్యం ప్రాక్టీస్ చేసేందుకు సరైన మైదానం లేకపోవటంతో వారు దూర ప్రాంతాల మైదానాలకు వెళ్లి ప్రాక్టీస్ చేసుకోవాల్సి వస్తోంది.

జీవీఎంసీ 58వ వార్డు నుండి 63వ వార్డు పరిధిలో సుమారు లక్షకు పైగా జనం నివసిస్తున్నారు. వీరిలో సుమారు వెయ్యి మంది వరకు వివిధ క్రీడా రంగాల్లో రాణిస్తున్నారు. అంతే కాక ఆయా క్రీడల్లో శిక్షణ పొందుతున్న వారు సుమారు 2 వేల మంది వరకు ఉంటారు. ఆయా వార్డుల పరిధిలో అధికంగా క్రికెట్, బాక్సింగ్, కరాటే, రన్నింగ్, షటిల్, బ్యాడ్మింటన్ వంటి క్రీడల్లో రాణిస్తున్నారు. కొందరు శిక్షణ తీసుకుంటున్నారు. అయితే వీరు గతంలో షిప్‌యార్డ్ కళాశాల ఎదురుగా ఉన్న మైదానంలో గానీ జింక్ వద్ద గల మైదానంలో గాని శిక్షణ పొందే వారు. అయితే షిప్‌యార్డ్ నేవల్ ఆధీనంలోకి వెళ్లిపోవడంతో ఆ గ్రౌండ్‌లోకి షిప్‌యార్డ్ ఉద్యోగులు, వారి పిల్లలు తప్ప ఇతరులను అనుమతించడం లేదు. అలాగే జింక్ పరిశ్రమ మూసేయటంతో ఆ క్రీడా మైదానం ఆలనా పాలనా లేక శిథిలమయింది. తుప్పలు బలిసి, గోతులు ఏర్పడి ఏమాత్రం అనువుగా లేదు.

**కలగానే మిగిలిన మైదానం నిర్మాణం..**

ఇదిలా ఉండగా 2013లో హెచ్‌పీసీఎల్ నిధులతో శ్రీహరిపురం, గుల్లలపాలెం వద్ద జీవీఎంసీకి చెందిన మైదానం (వాకింగ్ పార్కు)లో ఆధునిక వసతులతో క్రీడా మైదానం నిర్మించేందుకు సన్నాహాలు చేశారు. చివరి నిమిషంలో ఏమైందో ఏమో గానీ ఆ పనులు ముందుకు కదలలేదు. దీంతో ఇక్కడ క్రీడా మైదానం నిర్మాణం జరగలేదు. అలాగే 60వ వార్డు గుల్లలపాలెం, వుడా కాలనీ వద్ద జీవీఎంసీ నిధులతో ఇండోర్ స్టేడియం నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది.



ప్రకాష్‌నగర్ పాఠశాల మైదానంలో కబడ్డీ ఆడుతున్న యువకులు

**మైదానం కోసం నిరీక్షణ..**

జీవీఎంసీ 58 నుండి 63వ వార్డు పరిధిలో సరైన మైదానం లేక క్రీడాకారులు నగరంలోకి లేదా స్టీల్‌ప్లాంట్ మైదానం వద్దకు వెళ్లాల్సి వస్తోంది. అధికారులు ఈ సమస్యపై స్పందించి ఇప్పటికైనా పారిశ్రామిక ప్రాంతంలో వసతులతో కూడిన క్రీడా మైదానం నిర్మించాలని క్రీడాకారులు ఆశగా ఎదురు చూస్తున్నారు.



గోతులతో నిండిన మైదానంలోనే ఆడుతున్న యువత

### ప్రాక్టీస్ కోసం సిటీకి వెళ్తున్నా..



జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలో ఉంటున్న నేను బాక్సింగ్ ప్రాక్టీస్ చేసేందుకు సరైన మైదానం లేక పోర్టు స్టేడియంకు వెళ్లి అక్కడ ప్రాక్టీస్ చేస్తున్నాను. దీనికి చాలా శ్రమ పడాల్సి వస్తోంది. అధికారులు మల్కాపురం లేదా శ్రీహరిపురం పరిధిలో ఓ మైదానం ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– రేష్మా యాదవ్, మహిళా బాక్సర్, గోల్డ్ మెడలిస్ట్, మల్కాపురం

### మైదానం లేక త్రోబాల్ వదిలేసా..



కళాశాల స్థాయి నుండి త్రోబాల్, టెన్నిస్ రంగంలో మంచి గుర్తింపు సాధించాను. జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వెళ్లాలంటే మరింత ప్రాక్టీస్ అవసరం. అయితే దగ్గరలో సరైన మైదానం లేక, స్టీల్‌ప్లాంట్ మైదానానికి వెళ్లి ప్రాక్టీస్ చేయలేక త్రోబాల్ ఆట పూర్తిగా విడిచిపెట్టాను.

– వై.అశోక్, టెన్నిస్, త్రోబాల్ ప్లేయర్, శ్రీహరిపురం

## క్లుప్తంగా

### ఉపాధ్యాయులకు సత్కారం



విద్య నేర్పే గురువులను సత్కరిస్తున్న విద్యార్థులు

**మల్కాపురం:** విద్య నేర్పిన గురువులను విద్యార్థులు, తల్లిదండ్రులు మర్యాదపూర్వకంగా గౌరవించుకున్నారు. 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఆదివారం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఇంత కాలం వారికి విద్యను బోధించిన గురువులను సత్కరించారు. పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### నేడు జిల్లా స్థాయి సైన్స్ దినోత్సవం

**విశాఖ విద్య:** జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయి వేడుకలను సోమవారం గోపాలపట్నం బాలుర హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్సు అధికారి కె.ప్రసాద్ తెలిపారు. క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ అంశాలపై విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. ఇప్పటికే మండల స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేయటం జరిగిందన్నారు. సుమారు 200 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని సైన్సు ఉపాధ్యాయులు అంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### రజకవీధి చిన్నారులకు కాంగో డ్రమ్స్ బహూకరణ



కాంగో డ్రమ్స్ అందజేసిన డిప్యూటీ మేయర్ శ్రీధర్

**విశాఖ విద్య:** జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడా లేఅవుట్ రజకవీధి చిన్నారులకు నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కాంగో డ్రమ్స్‌ను బహూకరించారు. ఇటీవల జరిగిన బల్లల పండగలో డప్పులు వాయిస్తూ అద్భుత ప్రతిభ కనబరిచిన చిన్నారులకు కాంగో డ్రమ్స్ ఇస్తామని శ్రీధర్ హామీ ఇచ్చారు. ఆ మేరకు ఆదివారం శాంతినగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో చిన్నారులకు సుమారు.రూ.40 వేలు విలువ చేసే కాంగో డ్రమ్స్ అందించారు. ఈ సందర్భంగా చిన్నారులు, తల్లిదండ్రులు శ్రీధర్ చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

### గల్లాను అభినందించిన 'మళ్ల'



గల్లా శ్రీనును అభినందిస్తున్న మళ్ల విజయప్రసాద్

**మల్కాపురం:** వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన మాజీ కార్పొరేటర్ గల్లా శ్రీను ఆదివారం ఆ పార్టీ పశ్చిమ సమన్వయ కర్త మళ్ల విజయప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. విజయప్రసాద్ గల్లా శ్రీనుకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. పార్టీ బలోపేతానికి,కార్యకర్తల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు.

### మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న గొలగాని వీరారావు

**సీతంపేట :** హిందూ ముస్లిం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీతంపేట రాజేంద్రనగర్‌లోని హిందూ ముస్లిం కాలనీలో ఆదివారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. కాలనీకి చెందిన బషీర్ బాబు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ గొలగాని వీరారావు ప్రారంభించారు. ఆయన చేతుల మీదుగా పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

### ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

**కంచరపాలెం:** జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ. 50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్ ఆలయ ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

### ఘనంగా బల్లల పండగ



పూజలు చేస్తున్న గులిగిందల కృష్ణ, రజక సంఘం ప్రతినిధులు

**మల్కాపురం:** జీవీఎంసీ 58వ వార్డు కుంచుమాంబ కాలనీ పరిధిలో ఆదివారం బల్లల పండగను స్థానిక రజక సంఘం ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, రజక సంక్షేమ సంఘం ప్రతినిధి గులిగిందల కృష్ణ సంఘం ఆధ్వర్యంలో జరిపిన పూజల్లో పాల్గొన్నారు. రజక సామాజిక వర్గ ప్రజలతో పాటు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరానికి విశేషస్పందన

**గోపాలపట్నం:** జీవీఎంసీ 89వ వార్డు సంతోష్‌నగర్‌లో కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్త దాన శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, యువ నాయకుడు మౌర్య సింహ, వార్డు అధ్యక్షుడు బొడ్డేటి విజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదాన అంటే ప్రాణ దానం చేసినంత పుణ్యం అన్నారు. సకాలంలో రక్తం అందక మృత్యువాత పడిన వారు చాలా మంది ఉన్నారన్నారు. ప్రజల్లో అవగాహన కలగడంతో ఈ రకమైన ఘటనలు తగ్గాయని తెలిపారు. రక్తదానంపై అపోహలు వీడి రక్తదానానికి ముందుకు రావాలన్నారు. కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు గెంబలి మధుసూధనరావు మాట్లాడుతూ సంఘ సభ్యుల సహకారంతో 68 యూనిట్లు రక్తం సేకరించామన్నారు. శిబిరానికి సహకరించిన విశాఖ బ్లడ్ సెంటర్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి జగదీష్, కోశాధికారి మిన్నారావు, ఉపాధ్యక్షులు గణేష్, రాధ, సభ్యులు కనకరాజు, సుధాకర్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న కళింగ వైశ్య సంఘం సభ్యులు

## గుర్తుకొస్తున్నాయి..



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

**గోపాలపట్నం:** నరవ జిల్లా పరిషత్ పాఠశాల 1995–96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులంతా పిల్లల్లా మారి సందడి చేశారు. ఒకరికొకరు జ్ఞాపకాలను పంచుకున్నారు. చాలా ఏళ్ల తర్వాత కలిసిన వారు విద్యార్థి దశను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అందరూ ప్రయోజకులై ఒక వేదికపై కనిపించడంతో ఉపాధ్యాయులు సంతోషంతో కన్నీటి పర్యంత మయ్యారు. కార్యక్రమాన్ని జె. శ్రీను, జీవీ నర్సింగరావు, మజ్జి నర్సింగరావు, జి. శ్రీను, అప్పలస్వామి, మళ్ల నూకప్పారావు, నాగేశ్వరరావు, అప్పలరాజు సమీక్షించారు.

## పోలమాంబ జాతర ప్రారంభం



అమ్మవారిని తోడ్కొని వస్తున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) పోలమాంబ అమ్మవారు



నెత్తిన బిందెలతో కోలాటం ఆడుతున్న మహిళలు



అమ్మవారి జలాభిషేకానికి కలశాలతో పసుపు, కుంకుమ నీళ్లు తీసుకెళ్తున్న మహిళలు

**డాబాగార్డెన్స్:** పాతనగరంలోని మంథా వారివీధి (రజకవీధి)లో వెలసిన పోలమాంబ జాతర (34వ పరస) మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఉత్సవంలో భాగంగా ఉదయం అమ్మవారికి ప్రారంభ పూజలు, మంగళ స్నానం చేశారు. మహిళలు పెద్ద ఎత్తున పసుపు నీళ్లతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. సాయంత్రం 6 నుంచి భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆటల పోటీలు ఏర్పాటు చేశారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటలకు ప్రత్యేక పూజలు, 7 గంటలకు పంచామృతాభిషేకాలు, సహస్ర అర్చనలు, జోగి కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు అమ్మవారి సారె ఊరేగింపు, ఉయ్యాల కార్యక్రమం జరుగుతాయి. ఉత్సవంలో భాగంగా 5న ప్రధాన పండగ, అమ్మవారి జాతర కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్టు ఉమా మహేశ్వర ఆలయం, పోలమాంబ అమ్మవారి సేవా సంఘం అధ్యక్షుడు దమరశింగు కనకారావు, కార్యదర్శి గుడివాడ శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కరగాని శంకరరావు, ఉపాధ్యక్షుడు బొండాడ లక్ష్మీప్రసాద్, కోట్ల సాయిబాబా, కోశాధికారి పండా సత్యనారాయణ తెలిపారు. ప్రధాన పండగను పురస్కరించుకుని మంగళవారం ఉదయం 7 గంటలకు కుంకుమ పూజలు, పుష్పాలంకరణ, సాయంత్రం అగ్నిగుండం, పులివేషాలు, తప్పిటగుళ్లు, తాడేపల్లిగూడెం కళాకారులచే కాళికా శక్తి ప్రదర్శన వంటి కార్యక్రమాలతో పాటు పలు సాంస్కృతిక అంశాలు ఏర్పాటు చేసినట్టు సంఘం సభ్యులు తెలిపారు.

### ఏదురవానిపాలెం గ్రామ అధ్యక్షుడిగా సన్యాసిరావు



సన్యాసిరావు

**మల్కాపురం:** జీవీఎంసీ 58వ వార్డు ఏదురవానిపాలెం గ్రామాధ్యక్షుడిగా ఏదుర సన్యాసిరావు (నల్ల సన్యాసిరావు) ఎన్నికయ్యారు. గ్రామంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సన్యాసిరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో గ్రామస్తులంతా ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానన్నారు. గ్రామం అభివృద్ధికి తన శక్తికి మించి శ్రమిస్తానన్నారు.

### కనులపండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో భూ నీలా సమేత వేంకటేశ్వర స్వామి

**సీతమ్మధార :** సీతమ్మధార గురువాయురప్పన్ శ్రీకృష్ణ మందిరం వద్ద గల ఫంక్షన్ హాల్‌లో శృతిలయ భక్తి సంగీత సేవా సంస్థ వ్యవస్థాపకులు వి.ప్రభాకర్ సారథ్యంలో శ్రీ భూ నీలా సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళ ధ్వని, వేదమంత్రాలతో శ్రీమాన్ పాణంగిపల్లి రంగనాథ స్వామి బృందం కనులపండువగా కల్యాణోత్సవం జరిపించారు. ముందుగా తిరువీధి మహోత్సవం వేదిక నుంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాటం, సంకీర్తనలు, గోవింద నామస్మరణతో ప్రారంభమై, సీతమ్మధార త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామి ఆలయం వద్దకు చేరుకుని... తిరిగి కల్యాణ వేదిక వద్ద ముగిసింది. ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ కల్యాణంలోని ఘట్టాలను చక్కగా వివరించారు. కమిటీ సభ్యులు కేపీ రాజు, వి.ప్రభాకర్, ఎంఎస్ మాధవ్, సీహెచ్‌వీ సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నాం

**గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీరామమూర్తి**



ఐక్యత చాటుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

**మల్కాపురం:** గడిచిన యూనియన్ ఎన్నికల్లో షిప్‌యార్డ్ కార్మికులకు ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని, ఆ హామీ నెరవేర్చే వరకు అలుపెరగకుండ శ్రమిస్తామని షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి పైలా శ్రీరామమూర్తి అన్నారు. 61వ వార్డు మల్కాపురం, మరిడిమాంబ కల్యాణ మండపం వద్ద షిప్‌యార్డ్ ఐఎన్‌టీయుసీ (గుర్తింపు యూనియన్), ఇందిరా ప్రియదర్శిని సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సంస్థలో పని చేస్తున్న కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తామన్నారు. రానున్న రోజుల్లో కార్మికులందరికీ మంచి జరగనుందన్నారు. ఇందిరా ప్రియదర్శిని సంక్షేమ సంఘం సభ్యుల పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు, మరణించిన సంఘం సభ్యుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ, నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో అతిథులుగా జిల్లా ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి నీరుకొండ రామచంద్రరావు, పూండి మల్వేశ్వరరావు, సూర్యచంద్రరావు, యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ బోసు, ఆఫీస్ బేరర్లు, కో ఆపరేటివ్ డైరెక్టర్లు, స్టాఫ్, వర్క్‌మెన్ కార్మికులు, ఎల్ అండ్ ఎం సిరీస్ కార్మికులు పాల్గొన్నారు.

**నూతన పాలక వర్గం**

ఐఎన్‌టీయూసీ గౌరవ అధ్యక్షుడిగా పైలా శ్రీరామమూర్తి, అధ్యక్షుడిగా ఎస్.రవికుమార్, సెక్రటరీగా టి.నూకరాజు, కోశాధికారిగా ఎం.చంద్రమోహన్ నియమితులయ్యారు. ఇందిరా ప్రియదర్శిని సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడిగా పైలా శ్రీరామమూర్తి, అధ్యక్షుడిగా రవీంద్ర, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా బి.మారుతీరావు, ప్రచార కమిటీ చైర్మన్‌గా భోగవల్లి సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## కానరాని సిగ్నల్ లైట్లు



ఇండస్ట్రియల్ ఎస్టేట్ కూడలిలో కానరాని ట్రాఫిక్ సిగ్నల్స్

**కంచరపాలెం:** జీవీఎంసీ 56, 57 వార్డుల పరిధి కంచరపాలెం ప్రధాన రహదారి నుంచి మర్రిపాలెం వెళ్లే మార్గంలో ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ జాడ కనిపించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ తుప్పు పట్టి మూలకు చేరడంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని వాహన చోదకుడు, స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్త సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## సామాజిక సేవతోనే మానవ జన్మకు సార్థకత



వాకర్లకు బహుమతులు అందిస్తున్న భాగ్యలక్ష్మి

**మురళీనగర్ :** సామాజిక సేవ ద్వారా మన చుట్టూ ఉన్నవారికి సాయపడడంతోనే మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని సెయింట్ ఆన్స్ ఉమెన్స్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఈపీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. సమాజంలో ఆకలితో అలమటిస్తున్న బాలలు ఎంతో మంది ఉన్నారని, అలాంటి వారికి ఒక్క పూట భోజనం పెట్టి ఆదుకోవాలన్నారు. పార్కులో పచ్చదనం పెంపునకు నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఆమె ప్రశంసించారు. పార్కులో గ్రంథాలయం నిర్వహణ బాగుందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మార్చి నెలలో నిర్వహించాల్సిన సేవా కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి ఆర్.సత్యనాథం, క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎన్.బుచ్చయ్య, కార్యదర్శి సీహెచ్ఎస్ఎస్‌వీ ప్రసాదరావు, సంయుక్త కార్యదర్శి ఎస్.ప్రకాశరావు, కోశాధికారి ఆర్.నాగేశ్వరరావు, జాలీ వాకర్ ఎన్.మాధవి పాల్గొన్నారు.

## ఇంట్లో చోరీ

**మర్రిపాలెం :** కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో చోరీ ఘటన ఆదివారం వెలుగుచూసింది. క్రైం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రెడ్డి కంచరపాలెంలో కుటుంబంతో కలిసి నివసిస్తున్న ఆర్.సత్యానారాయణ శుక్రవారం బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం ఇంటికి చేరుకునేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించారు. వెంటనే డయల్ 100కు ఫోన్ చేశారు. ఘటనా స్థలానికి కంచరపాలెం పోలీసులు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఇంట్లో ఉన్న ముప్పావు తులం బంగారం, కొంత నగదు పోయినట్టు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు క్రైం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వేంకటేశ్వరునికి విశేష అలంకరణ



విశేష అలంకరణలో లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి

**అక్కిరెడ్డిపాలెం:** శీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో వేంకటేశ్వరునికి విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం వేకువజాము నుంచే ఆలయంలో అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. ఈ సందర్భంగా విశేష పుష్పాలతో సహస్ర నామార్చన అనంతరం లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరుడిని విశేష పుష్పాలతో అలంకరణ చేపట్టారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.